ఫుడ్ ఆన్ వీల్స్

కలెక్టరేట్ సమీపంలో అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

- కలెక్టరేట్ ఆవరణలో అన్నదానం
- ప్రజావాణి అర్జీదారులకు కడుపునిండా భోజనం
- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహణ
- సంబురపడుతున్న ఫిర్యాదుదారులు

పెద్దపల్లి, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి లయన్స్ క్లబ్ మరోమారు తమ సామాజిక సేవను మరింతగా విస్తరించింది. ఎన్నోకష్టాలు, ఇబ్బందులతో కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి అర్జీలు సమర్పించే వారికి కడుపునిండా భోజనం పెడుతున్నది. కలెక్టరేట్ ఆవరణలోనే ప్రత్యేక వాహనాన్ని (ఫుడ్ ఆన్ వీల్స్) ఏర్పాటు చేసి అన్నదానం చేస్తున్నది. ప్రతి సోమవారం దాదాపుగా 250-300 అర్జీదారులతోపాటు ప్రజలకు భోజనం అందిస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

రెండు నెలలు నిర్విరామంగా..

గత జూలై 1న పెద్దపల్లి లయన్స్ క్లబ్ నిర్వహకులు కావేటి రాజగోపాల్, బోడకుంట రాంకిషన్, తూము రవీందర్, మీసాల సత్యనారాయణ, మహేందర్, టీవీన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ ఆధ్వర్యంలో ఫుడ్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం రెండు నెలలకు పైగా నిర్విరామంగా, నిరాటంకంగా కొనసాగుతున్నది.

సంతోషంగా ఉంది..

ప్రజావాణికి వచ్చేవారంతా పేదోళ్లే.. కలెక్టర్ అర్జీలు ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకంతో చాలా మంది వస్తుంటారు. చాలా సేపు క్యూలో నిలబడి అర్జీలు ఇస్తుంటాం. బయటికి వెళ్లే సమయానికి ఆకలి అయితది. ఆ సమయంలో అన్నదానం చేయడం సంతోషకరం.

- మామిడిపల్లి బాపయ్య, మాజీ సర్పంచ్ (కాపులపల్లి, పెద్దపల్లి మండలం)

అన్నదానం గొప్పది

నేను ప్రజావాణికి వచ్చి దరఖాస్తు ఇచ్చిన. తర్వాత ఆకలి కావడంతో బయటికి వెళ్లి ఏదైనా తిందామని అనుకున్న. అప్పుడే లయన్స్ క్లబ్ వాళ్లు 'ఫుడ్ ఆన్ వీల్స్' కార్యక్రమం ద్వారా అన్నం పెడుతున్నరు. వెంటనే వచ్చి తిన్న. ఇది మంచి కార్యక్రమం. ఇక్కడికి వచ్చినోళ్లకు అన్నం పెట్టడం గొప్ప నిర్ణయం.

- కొంకిళ్ల సంపత్, దివ్యాంగుడు (పెద్దపల్లి)

సమస్యలు పరిష్కరించండి

రామగిరి, సెప్టెంబర్ 9: నవాబుపేట గ్రామంలోని వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు రొడ్డ కుమార్ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును కోరారు. సోమవారం మంథనికి వచ్చిన మంత్రిని కుమార్ కలిసి సమస్యలు విన్నవించారు.

వానొస్తే వణుకే..

రాజీవ్ రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద (ఫైల్)

- రంగంపల్లి వద్ద స్టేట్ హైవేపై వరద ఉధృతి
- భారీగా ట్రాఫిక్‌జామ్.. రాకపోకలకు అంతరాయం
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న పట్టణ ప్రజలు

పెద్దపల్లి, సెప్టెంబర్ 9: జిల్లా కేంద్రానికి వివిధ పనుల కోసం నిత్యం వేలాది మంది వస్తుంటారు. అయితే వానకాలం వచ్చిందంటేచాలు.. జిల్లాకేంద్రానికి వచ్చేందుకు చాలా మంది వణుకుతున్నారు. ఎందుకంటే.. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ సమీపంలోని రంగంపల్లి వద్ద స్టేట్ హైవే రాజీవ్ రహదారిపై వరద ఉధృతంగా ప్రవహించడమే కారణం. చెరువు మత్తడి దుంకినట్లు రోడ్డుపైకి వరద వస్తుండడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది. అంతేకాకుండా ఆ రోడ్డు పక్కనే ఉన్న ఆర్టీవో కార్యాలయం, 33/11 కేవీ రంగంపల్లి సబ్‌స్టేషన్, కాళికామాతా ఆలయంలోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. వరద తాకిడికి తారు కొట్టుకుపోయిందని, వర్షం తగ్గినా మరమ్మతులు చేయడంలేదని వాహనదారులు మండిపడుతున్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే గానీ పట్టించుకోరా అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

రెండు సంవత్సరాలకే గుర్తింపు

గోదావరిఖని, సెప్టెంబర్ 9: సింగరేణి సంస్థలో ఎన్నికలు జరిగిన తొమ్మిది నెలల తర్వాత ఎట్టకేలకు గుర్తింపు పత్రాన్ని సోమవారం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీకి అందజేశారు. గతేడాది డిసెంబర్ 27న సింగరేణి సంస్థలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల జరిగిన తర్వాత సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి నాలుగేళ్లు ఉండే విధంగా గుర్తింపు ఇవ్వాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తూ వచ్చింది. సింగరేణిలో రెండు సంవత్సరాల కాలపరిమితికి ఎన్నికలు జరిగాయని, రెండు సంవత్సరాలపాటు మాత్రమే గుర్తింపు ఉంటుందని పేర్కొన్నది. ఇప్పటికే 9 నెలలు గడిచిపోగా గుర్తింపు ఇచ్చిన తేదీ నుంచి రెండు సంవత్సరాల పాటు ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా ఐఎన్టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా కొనసాగుతాయి. ఇదిలా ఉంటే నాలుగు సంవత్సరాల కాలపరిమితిలో తమకు గుర్తింపు ఇవ్వాలని కోరుతూ న్యాయపోరాటం చేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు.

అంతర్జాతీయ రెస్క్యూ పోటీలకు సింగరేణి జట్టు

పోటీలకు తరలివెళ్తుతున్న రెస్క్యూ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 9: అంతర్జాతీయ రెస్క్యూ పోటీలకు సింగరేణి జట్టు సోమవారం తరలివెళ్లింది. శ్రీలంకలోని కొలంబియాలో ఈ నెల 15 నుంచి 20వరకు జరగనున్న అంతర్జాతీయ పోటీలకు సింగరేణి డైరెక్టర్ (పీఅండ్‌పీ) ఎన్‌వీకే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సింగరేణి జట్టు వెళ్లింది. నెలరోజులుగా సింగరేణి యాజమాన్యం రెస్క్యూ టీమ్‌కు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ అందించింది. గతంలో సింగరేణి జట్టు అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొని వివిధ విభాగాల్లో రెండుసార్లు ప్రతిభ కనబర్చింది. సింగరేణి కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పింది. అంతర్జాతీయ స్థాయి జరుగనున్న రెస్క్యూ రికవరీ, ఫైర్ ఫైటింగ్, రోప్ రెస్క్యూ, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ స్కిల్స్‌పై శిక్షణను అందించి సభ్యులను ప్రోత్సహించింది. రెస్క్యూ సభ్యులకు ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, రెస్క్యూ జీఎం కాంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

గనుల్లో రక్షణ చర్యలు పటిష్టంగా ఉండాలి

గోదావరిఖని, సెప్టెంబర్ 9: సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తి నుంచి రవాణా వరకు రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేయ్యాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం అర్జీ-1 ఏరియా స్థాయిలో స్థానిక ఇల్లందు క్లబ్‌లో నిర్వహించిన రక్షణ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. భూగర్భ గనులతోపాటు ఉపరితల గనుల్లో ప్రమాదాల నివారణతోపాటు గనుల చుట్టూ బౌండరీ పెన్నింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ మాట్లాడుతూ, జీరో అక్సిడెంట్స్‌తో ముందుకెళ్లాలని, నియర్ మిస్సింగ్ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఏరియాల వారీగా గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలు, ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలకు గల కారణాలను వివరించారు. ఇక్కడ రీజియన్ జీఎం సేఫ్టీ కేహెచ్ఎస్ గుప్తా, కొత్తగూడెం రీజియన్ సేఫ్టీ జీఎం కేజీ తివారీ, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కే రఘుకుమార్, ఏరియా ఇంజినీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ఏరియా సేఫ్టీ అధికారి సాయిప్రసాద్, ఇంజినీర్లు, రీజియన్ జేఎస్ఓఈ అండ్ ఎం ఇంజినీర్లు, ఐఎస్ఓ అండ్ ఎస్ఎంటీసీ అధికారులు, గనుల సేఫ్టీ అధికారులు ఉన్నారు.

జనగామలో ఎమ్మెల్యే పర్యటన

బురద రోడ్డులో నడుస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, నాయకులు, అధికారులు

గోదావరిఖని, సెప్టెంబర్ 9: నగరపాలక సంస్థ 9వ డివిజన్ జనగామ గ్రామంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ సోమవారం పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్‌లైట్స్, తాగునీటి వసతి, ఇతర కనీస సదుపాయల గురించి కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కార్పొరేషన్ నుంచి శానిటేషన్ జరిగేలా చూస్తామన్నారు.

వినాయక మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 9: వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని లక్ష్మీనగర్‌లో ప్రతిష్ఠించిన పలు గణపతి విగ్రహాలను సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ సందర్శించారు. అనంతరం మండపాల్లో విశేష పూజలు చేశారు. గణనాథుడి కరుణతో నియోజకవర్గ ప్రజలు, రైతులు నిండునూరేండ్లు, ఆయురారోగ్యాలతో బాగుండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆయా మండపాల నిర్వాహకులు సన్మానించారు.




BLOCKBUSTER నేడే చూడండి
RANA DAGGUBATI PRESENTS
35
సంధ్య 35 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
అర్జున్ ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
AMB ఎంబి- గచ్చిబౌలి 9.40,1.00,4.15,7.25,10.50
AAA ఎఎఎ - అమీర్‌పేట్ 10.15,1.05,4.30,7.40,10.55
ASIAN దిల్‌సుఖ్‌నగర్ 2.15PM
ASIAN పినీప్లెనెట్ ఎ/సి - కొంపల్లి 10.15,1.20,4.50,7.45,10.55
ASIAN ఎంక్యూబ్ - అత్తాపూర్ 10.20,1.20,4.50,7.45,10.50
ASIAN ఏషియన్‌రాధిక - కాప్రా 10.05,1.25,4.50,7.45,10.40
జెపి ఎ/సి - చందానగర్ 10.20,1.10